క్లుప్తంగా

16న విజయదుర్గమ్మకు జలాభిషేకం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 16వ తేదీన జంగారెడ్డిగూడెంలో కొలువైన విజయదుర్గమ్మ అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, వ్యవసాయం, వ్యాపారాలు వృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుతూ జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీ ఉదయం 8.30 గంటలకు జలాభిషేకం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అనంతరం అమ్మవారికి అత్యంత వైభవంగా అలంకరణ పూజలు నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి ఒక బిందెడు నీళ్లు తీసుకువచ్చి అమ్మవారి జలాభిషేకమునకు అర్చకులకు అందజేయాలని కోరారు.

కెథెడ్రల్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కెథెడ్రల్ చర్చ్‌లో మంగళవారం ధ్యాన వడకం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సేలం మేత్రాసన పీఠాధిపతి ఆరుల రాయప్ప, ఏలూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ ధ్యాన కార్యక్రమంలో ఫాదర్ పీ.బాల, ఫాదర్ మైఖేల్ ఇంజమాల, ఫాదర్ జార్జ్ స్టీవెన్, ఫాదర్ రాజు, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ అమ్మన్న రాజాతో పాటు 150 మంది గురువులు పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: అన్యాయంగా మూసివేసిన గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి అందులో పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎఫ్ కంపెనీ ఎదురుగా వారం రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న కంపెనీ ఉద్యోగులు అక్కడి నుంచి ప్రదర్శనగా నినాదాలు చేస్తూ గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. కంపెనీని వెంటనే తెరిపించేందుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.పెంటారావు, పి.గోవింద్, గుత్తుల శ్రీనివాస్, దండు రామలింగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రేమతత్వంతో మెలగాలి



పేదలకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఇతరులపై మానవత్వంతో మెలగాలని మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లోని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లోని 11 నిరుపేద కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వట్టి సుగుణాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుని వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నారు. సేవాతత్వంతోనే ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆ కుటుంబాలకు బియ్యం, ఇతర సరుకులు, సాయిరామ్ క్లాత్ యాజమాని పున్నం గోపి ఆర్థిక సాయంతో నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల కార్యదర్శి ఆడబాల బాబి, నాయకులు అల్లాడ ప్రసాదరావు, పచ్చా వెంకటేశ్వరరావు, పులిచర్ల వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి

గణపవరం: విద్యాసంస్థలు, హాస్టళ్లను పునః ప్రారంభించే నాటికి తరగతి గదులు, హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచాలని, కీటకనాశన మందు పిచికారీ చేసి, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం గణపవరంలోని పలు విద్యాసంస్థలు, హాస్టళ్లను ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చారు. దోమల కారణంగా అనేక అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని అందువల్ల దోమల నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టల్ గదులు, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేశారు.

ఎర్రకాల్వను అభివృద్ధి చేయరూ..!

- నీరు లేక వెలవెలబోతున్న ఎర్రకాల్వ
- నిరంతరం సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలంటున్న రైతులు



చింతలపూడి మండలం శెట్టివారిగూడెం వద్ద నీరు లేని ఎర్రకాల్వ అలుగు



మెట్ట ప్రాంతంలో పూర్తిగా ఎండిపోయిన ఎర్రకాల్వ

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురవక ఎర్ర కాల్వ వెలవెలబోతోంది. చింతలపూడి మండలం శెట్టివారిగూడెం వద్ద మేడవరపు చెరువు అలుగు నీరు ప్రవహించేదే ఎర్ర కాల్వ. ఇక్కడి నుంచి సుమారు 21 కి.మీటర్లు ప్రవహించి జంగారెడ్డిగూడెం వద్ద ఎర్రకాల్వ ప్రాజెక్టులో కలుస్తుంది. మేడవరపు చెరువు క్రింద సుమారు 2,000 ఎకరాలకు పైగా సాగు నీరు అందిస్తున్న ఈ కాల్వ, పొడవునా వేలాది ఎకరాలు పండుతుంటాయి. ఒకప్పుడు ఎర్రకాల్వ అంటే పొలాలను ముంపునకు గురిచేసే మహమ్మారి అని రైతులంతా భయపడేవారు. 1998లో సుమారు రూ.4.11 కోట్ల నిధులు మంజూరు చేసి కాల్వను 17.5 కి.మీటర్లు అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి రైతులకు ముంపు బాధ తప్పింది. రానురాను మెట్ట ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎర్రకాల్వ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మేడవరపు చెరువును అభివృద్ధి చేసి మినీ ప్రాజెక్టుగా మార్చాలని ఇక్కడి రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. వరదల సమయంలో ఎర్రకాల్వ నీరు క్రిందికి ప్రవహించి ఇక్కడి రైతులకు ఉపయోగపడటం లేదని వాపోతున్నారు. కనీసం చెక్ డ్యామ్‌లు కట్టినా భూగర్భ జలాలు పెరిగి మెట్ట ప్రాంతానికి కొంత వరకు ఉపయోగం ఉంటుందని అంటున్నారు. అలాగే మేడవరపు చెరువులో విపరీతమైన ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. ఆక్రమణలు తొలగించి చెరువును అభివృద్ధి చేసినట్లయితే రైతులకు మరింత మేలు జరుగుతుందని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



ఎర్రకాల్వ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలి. వర్షాకాలంలో మాత్రమే ఎర్రకాల్వకు వరద నీరు వస్తుంది. అలా కాకుండా ఎర్రకాల్వకు ఏడాది పొడవునా సాగు నీరు అందించేలా శాశ్వత చర్య తీసుకోవాలి. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి గోదావరి నీటిని ఎర్రకాల్వకు కూడా మళ్లించాలి.

– టి కుటుంబరావు, ఎన్‌జీఓ ప్రతినిధి, యర్రగుంటపల్లి

మేడవరపు చెరువును అభివృద్ధి చేయాలి



ప్రభుత్వం మేడవరపు చెరువు పూడికను తొలగించి అభివృద్ధి చేయాలి. వరదల సమయంలో నీరు కిందికి పోకుండా ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మించాలి. జిల్లాలోనే అతి పెద్ద చెరువు అయిన మేడవరపు చెరువును మినీ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలి. కాల్వ నీరు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.

– యర్రంశెట్టి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్, సుబ్బారాయుడుగూడెం

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి నూతన ప్రభుత్వం సహకరించాలని ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వానికి ఎస్సీ సర్పంచ్‌ల సంఘం తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పంచాయతీలకు బదలాయించి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. గ్రామ స్థాయిలో పంచాయతీలు స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలని గుర్తు చేశారు. పంచాయతీ వ్యవస్థలో రాజకీయాల ఒత్తిడి తీసుకు వచ్చి అధికారులపై పెత్తనం చెలాయించే విధంగా ఉండకూడదన్నారు. పంచాయతీ సర్పంచ్‌ల హక్కుల్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో పెత్తందారుల పెత్తనం లేకుండా సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు కట్టబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి

జిల్లా ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ సురేష్



బూసరాజుపల్లి గురుకుల పాఠశాలలో జరుగుతున్న స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మలేరియా రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ జె.సురేష్ అన్నారు. బుట్టాయగూడెం మండలంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గిరిజన ప్రాంతంలో మొదటి విడత మలేరియా నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజన సంక్షేమ బాల, బాలికల వసతి గృహాల్లో స్ప్రేయింగ్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూల్‌లో కూడా పనులు చేసినట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా ఇన్‌చార్జి డీఎంవో డాక్టర్ జె.సురేష్ తెలిపారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉంటే దోమల లార్వా వృద్ధి చెందుతుందని, అందువలన పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లలో తప్పనిసరిగా దోమ తెరలను వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. గిరిజన మండలాలైన బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో సుమారు 136 మలేరియా సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకూ 55 గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించుకోవాలని, పనులు చేస్తున్న వారికి సహకరించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి పి.పెద్దిరాజు, నందాపురం, అంతర్వేదిగూడెం పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా..

వైఎస్ జగన్‌ను కలిసిన రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి



క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిసిన శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి మోసపూరిత వాగ్దానాలు, విధానాలతో విజయాన్ని సాధించాయని దానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధపడొద్దని, కార్యకర్తలకు తాను అండగా నిలబడతానని ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పార్టీలోని పరిస్థితులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన విధానాలపై ఆయన పలు సూచనలు చేశారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలపై ధైర్యంగా ఉండాలని చెప్పారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మేలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం ఏ విధమైన విధానాలు అవలంభిస్తుందో వేచి చూడాలని తెలిపారు. రాబోయే కాలంలో ప్రజలకు భరోసా కల్పించేలా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారని తెలిపారు.

మంత్రిమండలిలో దివ్యాంగులకు స్థానం కల్పించాలి

ఏలూరు (టూటౌన్): దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం–2016 ప్రకారం దివ్యాంగులకు అన్నింటిలో సమాన భాగస్వామ్యం కల్పించాలని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి నటరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ప్రభుత్వానికి సంఘం తరపున స్వాగతం పలికారు. ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన మంత్రి మండలిలో దివ్యాంగులకు కేబినెట్ మంత్రిగా ఒకరికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను దివ్యాంగులకు కేటాయించాలని అల్లాడి నటరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయుడు వరప్రసాద్‌కు సన్మానం



కొయ్యలగూడెంలో ఉపాధ్యాయుడు ఊటుకూరి వరప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బోడిగూడెం హైస్కూల్లో ఉపాధ్యాయునిగా చేస్తున్న ప్రసాద్‌ను ఆయన సతీమణిని కొయ్యలగూడెంలోని సెయింట్ లూథరన్ చర్చిలో ఘనంగా సత్కరించారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి వివిధ తరగతుల పాఠ్య పుస్తకాలలో ప్రసాద్ రచించిన పాఠ్యాంశాలను ప్రచురించడం వాటిని విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టడం మన ప్రాంతానికి దక్కిన ఘనత అని చర్చి పెద్దలు పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు అదేవిధంగా జాతీయస్థాయిలో కేంద్ర మంత్రుల చేతులమీదుగా వరప్రసాద్ పురస్కారాలు అందుకున్నారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా పాఠ్యాంశాల సేకరణలో ప్రభుత్వానికి తన సహాయం అందిస్తానని వరప్రసాద్ పేర్కొన్నారు. జీడీవీకే ప్రసాద్, కరుణానిధి, బొలుసు నాగేశ్వరరావు, కొల్లూరు లక్ష్మణ్, డీఎస్‌వీ రామారావు, మడిచర్ల శ్రీనివాస్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అభయాంజనేయుని రథోత్సవం



మేళతాళాల నడుమ స్వామివారి రథోత్సవం, రథంలో కొలువైన అభయాంజనేయ స్వామివారు



ద్వారకాతిరుమల: స్థానిక తూర్పు వీధిలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామివారి రథయాత్ర వేడుక క్షేత్ర పురవీధుల్లో మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. ప్రతి ఏటా హనుమద్ జయంతి పర్వదినం నాడు నాయీబ్రాహ్మణులు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే ఈ ఏడు అనివార్య కారణాల వల్ల ఈ ఉత్సవం హనుమద్ జయంతినాడు జరగలేదు. దీన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం నాడు నాయీ బ్రాహ్మణులంతా కలసి స్వామివారి రథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా అభయాంజనేయుని ఉత్సవ మూర్తిని తూర్పు వీధిలో ఘనంగా ఊరేగించారు. ఆ తరువాత అశ్వ రథంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారిని క్షేత్ర పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ఆంజనేయ స్వామివారిని దర్శించి, తరించారు.

మంచినీరు సరఫరా చేయాలని ఆందోళన



రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న తిరుమలదేవిపేట ఎస్సీ ఏరియా వాసులు

టి.నరసాపురం: తిరుమలదేవిపేటలోని ఎస్సీ ఏరియాలో మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీవాసులు మంగళవారం చింతలపూడి – జంగారెడ్డిగూడెం రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కొద్ది రోజులుగా తమకు బురదనీరు సరఫరా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. ఇప్పటికే స్థానికంగా ఒక బోరుబావి ఉండగా, అందులో నుంచి బురదనీరు వస్తుందని, దీంతో మరో బోరు నిర్మించినా.. అది కూడా బురదనీరు వస్తుందని సర్పంచ్ గొల్లపల్లి సరోజిని తెలిపారు. మంచినీరు సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సరోజిని 'సాక్షి'కి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ.సాల్మన్‌రాజు కోరారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఇప్టూ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు జే.సోమేశ్వరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి సాల్మన్ రాజు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో బోధన మాతృభాషలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ తెలుగు మరియు ఆంగ్ల మాధ్యమాలలో బోధన కొనసాగించాలని కోరారు. యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.రెడ్డిదొర మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి ఆన్‌లైన్ కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలన్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ లేని ఉన్నత పాఠశాలలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు యూవీ.నరసింహరాజు, కే.ప్రకాష్, ఎస్.రమాదేవి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌కే.రంగావలి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో ఆర్టీసీ ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి. అలాగే ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఏలూరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో సమస్యలు ప్రస్తావిస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఎలా అవుతుందని ప్రశ్నించారు. సుందరయ్య ఏ పార్టీకి ఎన్నికల్లో ప్రచారం చేయలేదని, పోటీ చేసిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరలేదని, కానీ యాజమాన్యం అక్రమంగా, అన్యాయంగా సస్పెండ్ చేసిందని విమర్శించారు. సుందరయ్య అక్రమ సస్పెన్షన్ను వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఛలో ఏలూరు పిలుపు ఇస్తామన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు ఎస్ఎన్ రమేష్ మాట్లాడుతూ ఏలూరు డీపీటీవో ఆర్టీసీ ఉద్యోగులపై, నాయకులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడవలసిన జిల్లా అధికారి ఇలా వ్యవహరించడం తగదని హితవు పలికారు.

ఊపిరి ఉన్నంత వరకూ ప్రజాసేవలోనే

- మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పార్టీ శ్రేణులతో సమావేశం



ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: తన ఊపిరి ఉన్నంతవరకూ ప్రజాసేవలోనే ఉంటానని, గెలుపోటములు సమానంగా తీసుకోవడమే నాయకుని లక్షణమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమికి కుంగిపోకుండా కార్యకర్తలంతా ధైర్యంగా వారి కార్యకలాపాలను కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినందున మనమంతా వాటిపైనే ఎక్కువ దృష్టి సారించామని ఈ క్రమంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు సరిగ్గా వివరించలేకపోయామని అన్నారు. ఎంత చేసినా పచ్చపార్టీ, ప్రతిపక్షాలు, పచ్చమీడియా ప్రభుత్వంపై అదేపనిగా అసత్య ప్రచారాన్ని కొనసాగించి ప్రజలను తప్పుదోవ పట్టించాయన్నారు. ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రతిపక్షాలు, పచ్చమీడియా అదే పనిగా దుష్ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలు కలిగించడం కూడా మనకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కూటమిగా ఏర్పడిన వారి దుష్ట పన్నాగాలు, దుష్ప్రచారం, ప్రజలకు ఆచరణసాధ్యం కాని హామీలు గుప్పించి వారు అధికారంలోకి వచ్చారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని సుమారు రూ.1,600 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు వాసుబాబు తెలిపారు. అవినీతి మరక అంటకుండా నిజాయతీగా ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేశానని, రాజకీయాల్లో ఉన్నంతకాలం ఇలాగే నీతివంతంగా నడుచుకుంటానని వాసుబాబు అన్నారు. ఇక ముందు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవలందిస్తానని చెప్పారు. ప్రజా తీర్పును గౌరవిస్తానని, రాజకీయాల్లో గెలుపు ఓటమి సహజమని, నేటి ఓటమిని రేపటి విజయానికి తొలి మెట్టుగా తీసుకుని, పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.